ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025

5

అల్లూరి సీతారామరాజు



అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ యు.విమలకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి రావు ఈ కార్యక్రమానికి హాజరై మహిళా కార్యదర్శులతో పాటు అంగన్వాడీ కార్యకర్తలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమమునకు హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే. ధర్మారావు మాట్లాడుతూ, కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధించిన అంశాల పై సూచనలు ఇచ్చారు.యాప్లకు నమోదు, అపార్ ఐడి, నెట్వర్క్ సమస్యల పై వివరించారు. కడుతుల గ్రామ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పోషణ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఒ, కోఆర్డినేటర్ తిరుపతి రావు పౌష్టికాహారం, పిల్లల పోషణ పై తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



మొక్కల నడుమ వెళుతున్న వాహనాలు

ఘాట్ రోడ్డులో ప్రయాణం భయం భయం

-పిచ్చి మొక్కలతో వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అనంతగిరి- అరకు ఘాట్ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలతో వాహదనారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ. మండలాలలో ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది పర్యాటకులు ఈ ఘాట్ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తారు. దీంతో ఆ రోడ్డంతా వాహనాల రద్దీతో ఎప్పుడు కనిపిస్తుంది. ఈ ఘాట్ రోడ్డు అనంతగిరి మండలం శివలింగపురం గ్రామంలో ఒకటి హెయిర్ పిన్ బెండ్ మొదలుకొని, అరకు మండలం వరకు 15 హెయిర్ పిన్ బెండ్ మలుపులతో కూడిన ఈ ఘాట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో పిచ్చి మొక్కలు, పొదలతో ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించలేదు. దీంతో పలు వాహనాలు బోల్తా పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్న ఘటనలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరారు.

సిఐటియు నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:సిఐటియు అల్లూరి జిల్లా రెండవ మహాసభలు అరకులోయ టీటీడీ కళ్యాణ మండలం సర్బన్న వేదిక ప్రాంగణంలో అక్టోబర్ 6, 7 తేదీలలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా 7వ తేదీన సిఐటియు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రతినిధులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బోనంగి చిన్నయ్య పడాల్, ప్రధాన కార్యదర్శిగా వి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా ఎస్బి పోతురాజు, సహాయ కార్యదర్శిగా కె భాగ్యలక్ష్మి, భగత్ రాం, జినబంధు, ఎల్ సుందర్ రావు ,రవి, కె బాలన్న, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కిల్లో మోస్య, జి సత్యనారాయణ, కొర్ర తశంకర్రావు, దురియ నాగమ్మ, రేణుక, వెంకటగిరి, ఎల్బి రాజ్ కుమార్, లతో పాటు మరో 40 మందిని జిల్లా కార్యవర్గం సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వారు తెలిపారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు.



బోనంగి చిన్నయ్య పడాల్
జిల్లా అధ్యక్షులు



ఉమామహేశ్వరరావు
ప్రధాన కార్యదర్శి



పోతురాజు
కోశాధికారి



తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గర్భిణికి తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి-అనంతగిరి:ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో నిండు గర్భిణీలకు డోలీ కష్టాలు తప్పడం లేదు. వైద్యం కోసం వెళ్లాలంటే కనీస రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున ఘటనలు చోటు చేసుకుంది. మండలంలోని కొత్తురు పంచాయతీ పరిధి టెంకబుడ్డి గ్రామానికి చెందిన సీతమ్మకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం గ్రామంలో దట్టమైన అటవీ ప్రాంతం ఎత్తయిన కొండ కోనల నడుమ దిగువ ప్రాంతం మూడు కిలోమీటర్ల దూరం కొత్తూరు ఎస్ కోట మెయిన్ రోడ్డు తరలించి అక్కడ నుండి 108 అంబులెన్స్ ద్వారా ఎస్ కోట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. రోడ్డు సౌకర్యాలు కల్పించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మాణానికి కొలతలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -అనంతగిరి:రెండు జిల్లాల సరిహద్దు గరుగుబిల్లి - కొండపర్తి మార్గమధ్యలో వంతెన లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఈనెల 5వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలతో కలిసి బుధవారం కొలతలు వేశారు. అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల సరిహద్దు గ్రామ లకు చెందిన ప్రజలు ఈ వాగు పై నిత్యం రాకపోకలు సాధిస్తుంటారు. వంతెన పొడవు, వెడల్పు ఎస్టిమేషన్ కొలతలు వేయడం జరిగిందని జెఇ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రామస్తులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున అధికారులు, నాయకులు

పేపర్ లెస్ గవర్నెన్స్‌కు సహకరించాలి

-ఈ ఆఫీస్ ద్వారా అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు -జిల్లా రెవిన్యూ అధికారి కె.పద్మలత

ప్రజాశక్తి-పాడేరు : ఈ ఆఫీస్ ద్వారా అన్ని ఉత్తర ప్రత్యుతరాలు జరగాలని, పేపర్ లెస్ గవర్నెన్స్ కు అందరూ సహకరించాలని జిల్లా రెవిన్యూ అధికారి కె.పద్మలత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారి జరిపే ప్రత్యుత్తరాలకు సంబంధించి పేపర్ లెస్ గవర్నెన్స్ పూర్తి స్థాయిలో అమలు పరచాలన్నారు. బుధవారం జిల్లా కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా కలెక్టర్ కార్యాలయ, సబ్ కలెక్టర్, అన్ని మండల తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఆఫీస్ అమలు వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ శిక్షణా తరగతులకు అందరూ తహసీల్దార్ లు, హెచ్ డి టి లు, సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్ట్ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మలత

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు :మండలంలోని బరడ పంచాయతీ పరిధిలోని వంద్రుంగుల, సగ్గులు, కోదొంజోల, బిమిడి వెళ్ళే తారు రోడ్డు అస్తవ్యస్తంగా మారి రాళ్లు తేలడంతో ఆ ప్రాంత ప్రజలు ఏకమై రోడ్డును సొంత నిధులతో బుధవారం మరమ్మత్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీస బాలరాజు మాట్లాడుతూ, బరడా, లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో రోడ్డు పనులు చేసేందుకు భారీ లారీలు, పెద్ద టిప్పర్లు తిరుగుతుండడం వల్ల తారు రోడ్డు ధ్వంసం అయ్యిందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద కోతకు గురై రోడ్లు గుంతలుగా ఏర్పడి, పెద్ద పెద్ద రాళ్లు బయటికి తేలిపోయి పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో డ్రైనేజీలు లేకపోవడంతో మరింత రహదారి అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఆదివాసి గిరిజన పివిటిసిలకు మంజూరైన పీఎం జన్మన్ గహాలు నిర్మించుకోవాలంటే రోడ్డు మరమ్మతులు చేసుకోక తప్పలేదు అన్నారు. ఆర్థిక సహాయం అందించలేని గృహ లబ్ధిదారులు శ్రమదానంతో మరమ్మతలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కిల్లో రాము , వార్డు మెంబర్ శివ , కామేష్ , కిలో నాగేష్ , సీసా చిరంజీవి , గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



పనులు చేపడుతున్న గిరిజనులు

పంట నష్టపరిహారం అందించాలి

ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌కి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని వరదలకు నీట మునిగిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని పలువురు రైతులు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌కి వినతిపత్రం అందజేశారు. మండల సిపిఎం ప్రజా ప్రతినిధులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ కూటూరు, పెద్దార్కూర్ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్లను చింతూరు ఐటిడిఎ నుంచి తిరిగి సచివాలయాలకు పంపాలన్నారు. సిబ్బంది లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులను సచివాలయాలకు పంపాలని కోరారు. అలాగే వరదలో నీట మునిగిన పంటకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య సర్పంచులు మడకం నాగమణి, బొగ్గా వెంకమ్మ , ఎంపిటిసి కారం జయసుధ, సర్పంచ్ సోడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతి

మండలంలోని కూటూరు సచివాలయం పరిధిలో వరదలకు నష్టపోయిన పంటలకు వరికి ఎకరాకు 40,000 వేలు పంట నష్టపరిహారం అందించాలని పలువురు రైతులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిస్టెంట్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల వరదలు వల్ల ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ప్రభుత్వం 25 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్నప్పటి నుంచి ముంపులో ఉన్న భూములు రైతులు అనేక విధాలుగా నష్ట పోతున్నారన్నారు. ఇప్పటికైనా ముంపులో ఉన్న భూములకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, సర్పంచ్ వెంకమ్మ, సున్నం వెంకటేష్ పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌కి వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఐద్వా జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చింతూరు: రంపచోడవరం జిల్లా ఐద్వా మహాసభ ఈనెల 9వ తేదీన చింతూరు మండలంలో ఎర్రంపేటలో నిర్వహిస్తున్నామని వీటిని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పద్మ తెలిపారు. మహాసభల్లో గత మూడు సంవత్సరాలు చేసినటువంటి కార్యక్రమాలు, రాబోయే మూడు సంవత్సరాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి, జిల్లా నాయకులు హాజరవుతున్నారు. మహిళలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె తెలిపారు. దీనికి సంబంధించి చింతూరులో మహాసభల కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో చింతూరు మండల కార్యదర్శి రాములమ్మ, అధ్యక్షులు శ్రీదేవి, జిల్లా కమిటీ సభ్యులు చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మావతి తదితరులు

13న 'చలో ఐటిడిఎ'ను విజయవంతం చేయండి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీలో శతశాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని ఆదివాసులు హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న రంపచోడవరం ఐటిడిఎ వద్ద ఆదివాసీ హక్కులు,ఉద్యోగాలు సాధన కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో ఐటిడిఎ కార్యక్రమాన్ని ఆదివాసీలు విజయవంతం చేయాలని గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఆదివాసీ హక్కులు,ఉద్యోగాల సాధన కమిటీ సలహాదారు లోతా రామారావు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులచే భర్తీ చేయాలని,మెగా డిఎస్‌సిలో తీవ్ర అన్యాయం జరిగిన నేపథ్యంలో గిరిజన యువత ఇప్పటికైనా మేల్కోనాలని, ఏజెన్సీలో శతశాతం నియామకాలు చట్టం కోసం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టంఅమలు కోసం గిరిజనులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈ నేపథ్యంలో 13న ఛలో ఐటిడిఎ కార్యక్రమానికి గిరిజన యువత, మహిళలు ప్రజాసంఘాల నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు గిరిజనులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

11న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఈ నెల 11న స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గోకవరం ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి, సాయంత్రం 4 గంటల వరకూ మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది బుధవారం తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, చిన్నపిల్లల సాధారణ వైద్యనిపుణలచే ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైతే ఉచితంగా ఇసిజి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హత కలిగిన వారికే ఆశా కార్యకర్తల పోస్టులు ఇవ్వాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సి పరిధిలో ఆశా కార్యకర్తల నియామకాలను అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులకే కేటాయించాలని స్థానిక పీసా కమిటీ అధ్యక్షుడు కిలో మనోజ్ డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వాసుపత్రి పరిధి జిడిసి క్యాంపు ఆశ కార్యకర్త పోస్ట్ భర్తీ చేయడానికి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు కలెక్టర్ ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేస్తూ గిరిజనులకు ఆశ కార్యకర్తలుగా నియమించకుండా గిరిజనేతరులకు నియమించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్ట్ భర్తీకి వైద్యాధికారి స్థానిక నాయకులు మద్దతు తెలుపుతున్నారన్నారు. గిరిజనుల చట్టాలు హక్కులు కాపాడాల్సిన అధికారులే కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఆశ కార్యకర్త పోస్ట్‌ని గిరిజనులకి కేటాయించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో జెడ్‌పి హైస్కూల్లో బుధవారం బాలసుబ్రహ్మణ్యం పాడేరు అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం మెనూ పరిశీలించారు. ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఎంఇఒ- 2 శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి హెచ్‌ఎం కె. రమేష్ ఎంఈఓ 1 , బి.ఆనందబాబు , కె. వరప్రసాద్, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎడి

సోలార్ పథకాల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండ, దుప్పిలివాడ పంచాయతీలో బుధవారం జికె వీధి మండలం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విస్తృతంగా పర్యటించారు. సోలార్ సిస్టం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన మంచి నీటి పథకాలు పనితీరును పరిశీలించారు. గ్రామాలకు తాగునీటి సౌకర్యం సక్రమంగా జరుగుతుందా లేదా అని కిందస్థాయి అధికారు లను అడిగి ఆరా తీశారు. గ్రామాలకు తాగునీరు సరఫరాకి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎఇఇ కళ్యాణ్‌రామ్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఇ కరుణ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

స్వచ్ఛతసేవా కార్యక్రమంపై గ్రామసభ



మాట్లాడుతున్న కార్యదర్శి పరశురాం

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరు సచివాలయంలో స్థానిక సర్పంచ్ పాంగిదుర్గో అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, కార్యదర్శి పరశురాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత సేవా కార్యక్రమం అమలుపై గ్రామస్థాయి ప్రణాళిక తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. వార్షిక బడ్జెట్ ఆమోదం 2024-25 ,2025-26 సవరణలు 2026-27 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదం గురించి వివరించారు. త్రాగునీరు జల్‌జీవన్ పనులు ప్రగతిపై గ్రామసభలో ప్రజలకు వివరించారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు తీసుకోవాల్సిన చర్య గురించి చర్చించారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డు నిర్వహణ పారిశుధ్య స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణ ఐవిఆర్ ఫోన్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2025 సెప్టెంబర్ 3 వరకు పంచాయతీలో జరిగిన జమా ఖర్చులు ప్రజలకు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వళ్లిప్రసాద్ పంచాయతీ గుమస్తా ప్రకాష్, టిడిపి నాయకులు రాము, కె.సన్యాసిరావు, పీసా కమిటీ అధ్యక్షుడు మనోజ్, డ్వాక్రా మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

పలువురికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం దారకొండ పిహెచ్‌సిలో బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యనిపుణులు జానకిరామయ్య ఆధ్వర్యంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 95 మందికి పరీక్షలు నిర్వహించి 14 మందికి ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించేందుకు విశాఖపట్నం తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జానకిరామయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ పివి రమణ, బివిఎం రాణి, హెచ్‌వి రావులమ్మ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు



సైకిళ్లు పంపిణీ చేస్తున్న రామునాయుడు

సైకిళ్లు, యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు సైకిళ్ళ, యూనిఫారాల, పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సన్యాసి రావు, ఇన్చార్జి ఐటిపిఆర్డి రాము నాయుడు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుద్ధ్య పనులు వేగవంతంగా సాగేందుకు కొత్త సైకిళ్లు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పంచాయతీ నిధుల ద్వారా ఒక్కోటి రూ.40,000 విలువైన రెండు సైకిళ్లను రూ.80,000 వ్యయంతో కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, గతంలో ఉన్న రెండు సైకిళ్లు మరమ్మతులు గురై పనికి రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, పేసా అధ్యక్షులు,జనసేన నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయ: జిఎస్టి 2.0 కార్యక్రమంలో భాగంగా అరకులోయ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జీఎస్టీపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి జిల్లా జిఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.పద్మ విభూషణ్ ఆధ్వర్యంలో జిఎస్టి పై విద్యార్థులకు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోవరాజు, ఎంఈఓ వి. త్రినాథ్ రావు, జీఎస్టీ సిబ్బంది వెంకటరావు, పి అభిలాష్, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు:ఎలక్ట్రానిక్స్, అప్లిన్సెస్ వర్తకుల సహకారంతో ఈనెల 10న శుక్రవారం ఉదయం 10 గంటల నుండి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కాఫీ హౌస్‌లో జిఎస్టిపై వివరించారు.

వీడని వర్షం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. గత నెల రోజులపాటు ఈదురు గాలులు ఉరుమల తో కూడిన వాన బీభత్సం సృష్టిస్తుంది. బుధవారం 11 గంటలకు మొదలైన వాన సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసింది. డమ్ముకు, కాశీపట్నం గ్రామాలలో వారపు సంతలో కూరగాయలు పూర్తిగా తడిసిపోయాయి. డమ్ముకు బ్రిడ్జిపై అమ్మకానికి సిద్ధం చేసిన పూల మొక్కలను కొట్టుకుపోయాయి. ఈ వంతెన మీదుగా నిమ్మలపాడు. వాలసి, వేంగడ పెద్దబిడ్డ, గుమ్మ. పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు.

పలుచోట్ల గ్రామసభలు



పాడేరులో మాట్లాడుతున్న సహాయ కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు, : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం ద్వారా గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని సహాయ కలెక్టర్ సాహిత్ అన్నారు. బుధవారం హుకుంపేట మండలం సంపంగి పుట్టు గ్రామంలో నిర్వహించిన ఆది కర్మయోగి అభియాన్, (ఆది సేవ కేంద్రం) గ్రామ సభలో సహాయ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులు అవసరాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, విద్యుత్, వంటి మౌలిక సదుపాయాలతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు చేయూత వంటి కార్యక్రమాలు, చేసుకోవాచ్చునన్నారు.

ముంచింగి పుట్టు:: మండలంలోని కరీముఖి పుట్టు గ్రామ పంచాయితీ పరిధిలో గల బర్రెంగుల, గేదల బంధ గ్రామంలో నిర్వహించిన సీఎం జన్మన్ , ఆది కర్మయోగి గ్రామసభలో సిపిఎం మండల నాయకులు జి జీనా బంధు , జి సీతారాం పాల్గొన్నారు. జి.జీనాబంధు మాట్లాడుతూ గేదల బంధ గ్రామంలో గత ప్రభుత్వం సిసి రోడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణాలు కాలేదన్నారు. పి వి టి జి కులస్తులకు 35 కేజీల అంతోదయ కార్డులను వెంటనే ఇవ్వాలని త్రాగునీరు, కనెక్టివిటీ రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం



అవగాహన కల్పిస్తున్న స్టేట్ అబ్జర్వర్ రాజుబాబు

ప్రజాశక్తి-అరకులోయ:సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయ పాత్రే పునాది అని విద్యాశాఖ స్టేట్ అబ్జర్వర్ రాజబాబు తెలిపారు. అరకులోయ మండలంలోని మార్నింగ్ రిసార్ట్స్ లో మెగా డీఎస్సీ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన బుధవారం సందర్శించి నూతన డిఎస్సి ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు చేశారు. నూతనంగా ఎన్నికై విధుల్లో చేరబోయే ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషించడం కాకుండా బాధ్యతగా అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. అంకిత భావంతో పనిచేస్తే విద్యాభివృద్ధి మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంఈఓ -2 భారతిరత్నం, డుంబ్రిగూడ ఎంఈఓ జి. గెన్ను,తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఉచితంగా రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - ఆరిలోవ : రొమ్ము కేన్సర్ అవగాహన నెలను పురస్కరించుకొని అరిలోవ హెల్త్ సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఒక నెలపాటు ఉచితంగా బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు రోగ నిరోధక ఆరోగ్య సేవలను విస్తరించడంలో మెడికవర్ తీసుకుంటున్న కృషిని అభినందించారు. మహిళల్లో కేన్సర్ మరణాలను తగ్గించడానికి ప్రారంభ దశలో గుర్తించడం, క్రమం తప్పని స్క్రీనింగ్, సమయానికి వైద్య చికిత్స ఎంత ముఖ్యమో ఆమె వివరించారు. చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రమావత్ దేవ్ మాట్లాడుతూ, కేన్సర్ నియంత్రణకు అవగాహన, సులభంగా లభ్యమయ్యే వైద్య సేవలు అత్యంత ప్రాధాన్యం కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహిత్య, డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ అభిలాష్, సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యంపై చురుకైన భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉచిత స్క్రీనింగ్ సేవలు ప్రతి సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ నెల రోజుల కార్యక్రమంలో ఆంకాలజిస్టుల సలహా సమావేశాలు, ఆరోగ్య అవగాహన చర్చలు, స్త్రీరోగ నిపుణులు, నర్సింగ్ బృందం, సామాజిక కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు దీనిలో భాగంగా ఉంటాయని వివరించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఆరిలోవ : వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని, వాటిని మన కుటుంబంలో భాగం అని భావించినప్పుడు వాటి మనుగడకు ముప్పు వాటిల్లదని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బిఎం.దివాన్ మైదిన్ అన్నారు. జూ పార్కులో బుధవారం జరిగిన వన్యప్రాణ సప్తాహ వేడుకలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, వణ్య ప్రాణుల మనుగడకు నష్టం వాటిల్లితే మానవాళికి కూడా ఎంతో నష్టమని గుర్తు చేశారు. అటవీ శాఖ రీజినల్ హెడ్ బి.బాలాజి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే పిల్లలు పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించుకోవాలని కోరారు. జూక్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఈ సప్తాహ వేడుకల్లో విశాఖ నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చిత్రలేఖనం పోటీలో ప్రథమ బహుమతి సాధించిన కంచరపాలెం కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని కవిషా దుర్గాకు, ఇతర విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

నేరాలు ఘోరాలు

పిడుగు పడి చిరు వ్యాపారి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



వ్యాపారి మృతదేహం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి మండలంలో కొత్తపాలెం పంచాయతీ పరిధిలో బుధవారం మధ్యాహ్నం పిడుగు పడి ఓ చిరు వ్యాపారి దుర్మరణం చెందగా, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ఘటనతో ఈ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మన్యపురట్ల గ్రామానికి చెందిన ముత్త రమణ (54), అదే మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి రాంబాబు (60) ఇద్దరు చిరు వ్యాపారులు ప్రతి వారం అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపారం చేసేందుకు వస్తుంటారు. బుధవారం ఉదయం వీరు చింతపల్లి మండలం బెన్నవరం గ్రామానికి చెందిన రాజేంద్రకు వ్యాపార రుసుము అందజేసి తిరుగు ప్రయాణం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని చిన్నకొత్తపాలెం-కడశిల్ప గ్రామాల మధ్య చెట్టు కింద ఆగి భోజనం చేయసాగారు. ఇదే సమయంలో వర్షం కురవడంతో వారు వర్షం తగ్గాక ప్రయాణం కొనసాగిద్దాం అనుకున్నారు. కొద్దిసేపటికి ఆకాశం ఒక్కసారిగా మెరుస్తూ పిడుగు పడింది. ఆ పిడుగు వారి మీద పడటంతో ముత్త రమణ అక్కడికక్కడే మృతి చెందగా, రాంబాబు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. అటుగా వెళ్లిన వాహనదారులు పరిస్థితిని గమనించి వెంటనే చింతపల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన రాంబాబును కూడా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రమణ మృతితో మన్యపురట్ల గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. గ్రామస్తులు పిడుగు ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గంజాయి నిందితునికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి- చోడవరం : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు ప్రగాఢ గణేష్‌కు పదేళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ, చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ బుధవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్ల అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మాడుగుల మండలం ముకుందాపురానికి చెందిన ప్రగడ గణేష్ 2015 నవంబర్ 11న 100 కేజీలు గంజాయి రవాణా చేస్తుండగా అప్పటి చోడవరం ఎస్ఐరమణయ్య సిబ్బందితో కలిసి చోడవరం, కొత్తూరు జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితుడు పాడేరు పరిసర ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి, మైదానప్రాంతంలో అమ్మకానికి కారులో తీసుకొస్తుండగా పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, దర్యాప్తు అనంతరం కోర్టులో నేరాభియోగపత్రాలు దాఖలు చేయగా, విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పుచెప్పారు. ప్రభుత్వ న్యాయవాది యు.వెంకటరావు వాదించారు.

పాముకాటుతో వార్డు సభ్యుడు మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో పైడంపేట గ్రామ పంచాయతీ ఏడో వార్డు సభ్యుడు గోగాడ సన్యాసినాయుడు(54) పాము కాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ నెల 6వ తేదీన సాయంత్రం 4గంటల సమయంలో తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా, గోగాడ సన్యాసినాయుడు పాము కాటుకు గురయ్యాడు. వైద్యం కోసం అతడిని కుటుంబ సభ్యులు కె.కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు ు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యంవిషమించడంతో బుధవారం ఉదయం 8గంటల సమయంలో సన్యాసినాయుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మన్యం రైతులు ఢిల్లీ సభకు హాజరు కావాలి

ప్రజాశక్తి-సీలేరు: అగ్రికల్చర్‌టుడే మ్యాగజిన్ ఇండియన్ ఫార్మర్స్ కన్వెన్షన్ నవంబర్ 13న కాన్సిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించనున్నారని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ నాయకులు గడుతురి రామ్‌గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానికులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా మన్యం గిరి రైతులకు ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా వారికి ఎంతో విలువైన పరిజ్ఞానం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమానికి మన్యం గిరి రైతులను భాగస్వామ్యం చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిఎ పిఒకు లేఖ రాయడం జరిగిందని ఆయన తెలిపారు.



పలకలు, పుస్తకాలు అందించిన ఉపాధ్యాయురాలు సూర్యకళ

విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాల వితరణ

ప్రజాశక్తి -సీలేరు: విద్యార్థులకు ఉపాధ్యాయురాలు సూర్యకళ పలకలు నోట్‌పుస్తకాలు వితరణగా ఇచ్చి తన ఉదారత చాటుకున్నారు. జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులుగా సూర్యకళ విధులు నిర్వహిస్తున్నారు. దారకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధి నరమామిడి కొంది ఎంపిపిఎస్ పాఠశాల విద్యార్థులకు తన సొంత సొమ్ముతో పలకలు,పుస్తకాలు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆమెకి కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు


చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: జనవిజ్ఞానవేదిక మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ఆవిష్కరించారు. మండల యుటిఎఫ్ అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, కోశాధికారి పండయ్య, మారేడుమిల్లి ఎంఇఒ -2 ముత్యాలరావు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండల యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించి 8,9,10 తరగతి విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చని, తెలుగు, ఇంగ్లీషు భాషలో నిర్వహించబడతాయని, ఈనెల 18న పాఠశాలస్థాయి, నవంబర్ 1 మండల స్థాయి, జిల్లా స్థాయిలో నవంబర్ 23, అదేవిధంగా రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో సైన్స్ సంబరాలు నిర్వహిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఈశ్వరిదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-వి.ఆర్‌పురం: విద్యార్థిస్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు అమరవీరులగాథలు,తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. వీర్‌గాథ 5.0 పేరుతో వీటిని నిర్వహిస్తోంది. విఆర్‌పురం మండలం సోముల గూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన, పద్యాలు, డ్రాయింగ్, మల్టీమీడియా క్విజ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలను హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల పరిశీలన



తరగతులు పరిశీలిస్తున్న టిఎఆర్‌ఎల్ అధికారి కల్పన

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయులకు జరుగుతున్న మండల స్థాయి టిఎఆర్‌ఎల్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం టిఎఆర్‌ఎల్ అధికారి కల్పన సందర్శించారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత తరగతి గదిలో అమలుపరిచి విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివి లక్ష్మీనారాయణ ఎంఇఒ 1, వెంకటేశ్వర్లు ఎంఇఒ 2, రీసోర్స్ పర్సన్లు, క్లస్టర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కమిటీ ఏకగ్రీవం చేసినా ఉద్యోగం ఇవ్వలేదు

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: కమిటీ ఏకగ్రీవం చేసిన ఆశా వర్కర్‌కి తీవ్ర నిరాశే మిగిలింది. రంపచోడవరం నియోజకవర్గం, విఆర్ పురం మండలం రేఖపల్లి పిహెచ్‌సి పరిధిలో కుందులూరు గ్రామానికి చెందిన అభ్యర్థి ఆశవర్కర్ ఉద్యోగం కోసం విహెచ్‌ఎస్‌ఎన్ కమిటీ ద్వారా గొంది మంగమ్మ,ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంటర్వ్యూలో నలుగురు పేర్లు వచ్చాయి. విహెచ్‌ఎస్‌ఎన్ కమిటీ ఒక్కపేరు ఇస్తే నాలుగు పేర్లు ఎలా వచ్చాయని, అడిషనల్ డిఎంహెచ్‌ఒని ఆడిగామని, ఏవిధమైన సమాచారం ఇవ్వలేదని, మంగమ్మ, గొర్రె కవిత పేర్లు పెండింగ్ లిస్ట్‌లో ఉన్నాయని చూపించి గొర్రె కవితకి ఏ విధంగా పోస్ట్ ఇచ్చారని మీకు ఇష్టం వచ్చినట్లు జాబ్ ఇచ్చేటప్పుడు విహెచ్‌ఎస్‌ఎన్ కమిటీ పెట్టడం ఎందుకని పత్రికా ప్రకటనలో గ్రామస్తులు నిలదీశారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిఎస్‌టిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శంకరరావు మాట్లాడుతూ జిఎస్‌టి దేనికి తగ్గింది దేనికి తగ్గలేదు అనే అంశాల్ని పరిగణనలోకి తీసుకుని వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కామర్స్ శ్రీనివాస్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఇఒ-2 శ్రీనివాస్, ఎస్ఐ వినోద్

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయిలో అన్ని పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంఇఒ-2 శ్రీనివాస్, ఎస్ఐవినోద్, హెచ్‌ఎం వెంకటలక్ష్మి వీటిని ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, కోకో, సెటిల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులను డివిజన్‌స్థాయికి పంపిస్తామని ఎంఇఒ-2 పి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల మృతిని ప్రభుత్వ హత్యగా భావించాలి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:

కురుపాం గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థులకు సంబంధించి ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలుగా భావించాలని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర నాయకురాలు పాముల పుష్ప శ్రీవాణి ఆరోపించారు. బుధవారం వైసిపి నాయకులు అరకు ఎంపి గుమ్మా తనూజరాణి, పుష్ప శ్రీవాణి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా పుష్ప శ్రీవాణి మీడియాతో మాట్లాడుతూ, ఆహారం, మంచినీరు కాలుష్యం వల్ల విద్యార్థులకు వైరస్ సోకినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. గురుకుల పాఠశాలలో కనీసం తాగునీరు క్లోరినేషన్ కూడా చేయటం లేదన్నారు. కెజిహెచ్‌లో ఆక్సిజన్ పెట్టకపోవడం వల్లనే కల్పన అనే బాలిక చనిపో యిందన్నారు.

రాష్ట్రంలో ఏ పాఠశాలలో కూడా ఆర్‌ఓ ప్లాంట్‌లు పనిచేయ డం లేదన్నారు. గురువారం జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నం వస్తున్నారని తెలిసి, వ్యాధి తగ్గకపోయినా పిల్లలను బుధవారం డిశ్చార్జి చేశారన్నారు. ఎంపి డాక్టర్ గుమ్మ తనుజారాణి మాట్లాడుతూ 170 మంది గిరిజన బాలికలు హెపటైటిస్ సోకి అనారోగ్యం బారిన పడ్డారన్నారు మాజీమంత్రి అప్పలరాజు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతలేక ఈ వ్యాధి వచ్చిందని గిరిజన మంత్రి చెప్పడం శోచనీయం అన్నారు.

స్టీల్ ప్లాంట్‌పై చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే..

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ వల్ల స్టీల్‌ప్లాంట్ లాభాలబాట పట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం శుద్ధ అబద్ధమని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం 1654వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్యాకేజీగా ఇచ్చిన సొమ్మును స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన వాటికి ఖర్చు చేయటం లేదన్నారు. బ్యాంకుల రుణాలు తీర్చడానికి, జిఎస్‌టి బకాయిలు తీర్చడానికి వినియోగించారని చెప్పారు. ఈ వాస్తవాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెంజోన్ అధ్యక్షులు ఎస్.శ్రావణ్ కుమార్, ఎన్.ప్రకాశరావు, శ్రీనివాసరావు, లక్ష్మీపతి,ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని బుధవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ కాసి సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు,పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. వట్టిగడ్డ, మడేరు,కింద్ర పెద్దేరు, నెల్లిమెట్ల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలతో ప్రత్తి, పొగాకు, మినప, మొక్కజొన్న, కూరగాయ పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

'వసతిగృహాలు, పాఠశాలల్లో లోపాలు లేకుండా చూడాలి'

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఇటీవల కురుపాం గురుకుల పాఠశాల వసతిగృహంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. ఆయా మండల, జోనల్ ప్రత్యేకాధికారులు వసతిగృహాలను,పాఠశాలలను సందర్శించాలని, అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. బుధవారం సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. తాగునీటి పైప్‌లైన్లు, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల పైపులను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలుంటే సరిచేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్‌వ్యాధుల పట్ల అందరినీ అప్రమత్తం చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఆర్యవైశ్య యువజన సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి సహకారంతో బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద 'వాసవి భవన్'లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు నేతి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఒకసారి ఒక వ్యక్తి రక్తదానం చేస్తే ముగ్గురు వ్యక్తులను ప్రాణాపాయం నుండి కాపాడిన వారవుతారన్నారు. సంఘం కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ సేకరించిన రక్తం ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటి ద్వారా పేద పేషెంట్లకు సరఫరా చేస్తారన్నారు. 127 పర్యాయాలు రక్తదానం చేసి 128వ పర్యాయం రక్తదానం చేయడానికి వచ్చిన వంకాయల జవహర్ కార్యక్రమానికి చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎస్.కె.ఎల్.రావు, ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు రామకృష్ణ, శ్రీనివాసరావు, కందుల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇబి - 5 ఇన్వెస్టర్ వీసాపై సమీక్ష

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్: న్యూయార్క్ సిటీలో న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో అమెరికా ఇబి -5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రాంపై బుధవారం హోటల్ డాల్ఫిన్‌లో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇబి 5 ఐవిఈ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా నిర్వహించాయి. ఐఎసిసి, విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆంధ్రప్రదేశ్ చాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఎఫ్ఎపిసిఐ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్యా ఫిష్కిన్, ఇఎస్క్యు, ఇమ్మిగ్రేషన్ అటార్నీ మాట్లాడుతూ, ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై ఉన్న అయోమయం, భారతీయుల కోసం వివిధ వీసా కేటగిరీల్లో ఉన్న నిరీక్షణ కారణంగా, ఇబి-5 ప్రోగ్రామ్ అమెరికా గ్రీన్‌కార్డ్ పొందడంలో అత్యంత వేగవంతమైన మార్గం అని తెలిపారు. కానీ, పెట్టుబడిదారులు తమ పెట్టుబడి చేసే రీజినల్ సెంటర్, ప్రాజెక్ట్‌లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా సంస్థ చరిత్ర న్యాయపరమైన కేసులు, విఫలమైన ప్రాజెక్టులు ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఇబి-5 పెట్టుబడిపై ఆధారపడటం, పర్మనెంట్ గ్రీన్‌కార్డుల ఆమోదం లాంటి అంశాలు పరిశీలించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇబి-5 ప్రత్యేకత ఏమిటంటే, ఇది స్వయంగా స్పాన్సర్ చేసుకునే వీసా అని ఉద్యోగం అవసరం లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనలను కఠినతరం చేసిన తర్వాత, 'అమెరికాలో పెట్టుబడి పెట్టండి గ్రీన్‌కార్డ్ పొందండి అనే ప్రభుత్వ పథకంపై భారతీయుల ఆసక్తి పెరిగిందనిచెప్పారు. ఇబి 5 ఐవిఇ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రతినిధులు సుబ్బా రాజు పెరిచెర్ల, సంపన్న మల్హోత్రా పాల్గొన్నారు.